ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రాజన్న సిరిసిల్ల

జిల్లా వార్తలు

శుక్రవారం 8 ఆగస్టు 2025



సీనియర్ సిటిజన్ల సంక్షరణ చట్టం అమలుకు చర్యలు

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ సిటిజన్ల సంక్షరణ చట్టం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఒక ప్రకటనలో తెలిపారు. చట్టం అమలులో భాగంగా తెలంగాణ సీనియర్ సిటిజన్స్ మెయింటెనెన్స్ కేసులో మానిటరింగ్ సిస్టం తయారు చేశారన్నారు. సీనియర్ సిటిజన్ మెయింటెనెన్స్ కేసులు అఫ్‌లైన్‌లో కాకుండా ఆన్‌లైన్ పోర్టల్ నమోదు చేయాలన్నారు. మీసేవా కేంద్రాల్లో సీనియర్ సిటిజన్ కేసుల ఆన్‌లైన్ ఫైలింగ్ చేపట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో కేసుల పురోగతి వివరాలు ఎప్పటికప్పుడు తెలుస్తాయన్నారు. జిల్లాలో చట్టం అమలుకు అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.

బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల కపట ప్రేమ

- కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



సిరిసిల్లలో మాట్లాడుతున్న కేకే మహేందర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : బీసీలపై బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలవి కపట ప్రేమ అని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కేకే మహేందర్‌రెడ్డి మాట్లాడారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని చెప్పామన్నారు. దేశంలో ఎవరు చేయని సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకొన్న ఖర్గే, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కులగణన చేపట్టి శాస్త్రీయంగా అసెంబ్లీలో ఏకకంఠంతో ఆమోదింప చేశారన్నారు. అసెంబ్లీలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఐ ఏకకంఠంతో బీసీ బిల్లును ఆమోదించి పార్లమెంట్‌లో ఆమోదం కోసం రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌ను పొందుపరచి పంపించారన్నారు. సమైక్య రాష్ట్రంలో బీసీలకు ఎక్కువ రిజర్వేషన్లు ఉండేవని సుప్రీం కోర్టు 50శాతం మించి ఉండకూడదనడంతో తెలంగాణ వచ్చాక బీసీల రిజర్వేషన్లను 23శాతంకు కుదించబడిందన్నారు. అటువంటి పరిస్థితి ఎదురుపడవద్దని భారత రాజ్యాంగంలోని 9వ షెడ్యూలో పొందుపరిచి కేంద్ర ప్రభుత్వానికి బిల్లును పంపారన్నారు. బండి సంజయ్, అరవింద్‌కుమార్ బీసీలం అంటూనే బీసీ బిల్లును వ్యతిరేకిస్తున్నారని, దీనిబట్టి బీసీల పట్ల బీజేపీకి ప్రేమలేదని చెప్పవచ్చునన్నారు. బీసీ అని చెప్పుకుంటూ 12 సంవత్సరాలుగా దేశాన్ని పాలిస్తున్న నరేంద్రమోదికి బీసీలపై చిత్తశుద్ధి ఉంటే ఆహ్వానించాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లుపై మోదీపై ఇక్కడి బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు ఎత్తిడిని తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మహిళ జిల్లా అధ్యక్షురాలు కామునిి వనిత, జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మార్కెట్ కమిటి డైరెక్టర్ దుబాల వెంకటేశం, మాజీ కౌన్సిలర్లు వేముల రవి, కత్తెర దేవదాస్, రెడ్యానాయక్, రాగుల జగన్, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ నేరెళ్ళ శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఖోఖో ఎంపిక పోటీలు



జిల్లా స్థాయి పోటీలో ఎంపికైన క్రీడాకారులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని రైజింగ్ అకాడమి క్రీడామైదానంలో గురువారం జిల్లాస్థాయి ఖోఖో(ఓపెన్ టూ ఆల్)ఎంపిక పోటీలు జరిగాయి. జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి అజ్మీరా రాందాస్ పోటీలను ప్రారంభించారు. పోటీలలో ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను గుర్తించి ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు జిల్లా జట్టును ఎంపిక చేశారు. జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి ఎస్‌కే, వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్, రాధారాణి, రేణుక, చామంతి, రాజశేఖర్, అజయ్, సంతోష్, అక్బర్, షరీఫ్‌లు పాల్గొన్నారు.

ప్రతి మొక్క జీవించేలా చర్యలు తీసుకోవాలి..

- డీఆర్డీవో శేషాద్రి - అవెన్యూ ప్లాంటేషన్ పరిశీలన



అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీవో శేషాద్రి

తంగళ్లపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతిమొక్క జీవించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఆర్డీవో శేషాద్రి ఆదేశించారు. గురువారం తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పథకంలోని అవెన్యూ ప్లాంటేషన్‌ను పరిశీలించారు. అలాగే రైతులు పొలం గట్ల వెంబడి నాటుతున్న కొబ్బరి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లడుతూ రోడ్డు పక్కన నాటిన మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. నాటిన ప్రతి మొక్క బతికే విధంగా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవోలు నాగరాజు, రాజనర్సు తదితరులు ఉన్నారు.

పరిశోధనల వారధి ‘ప్రయాస్’



- పరిశోధనల వైపు విద్యార్థుల మళ్లింపు
- కొత్త పథకాన్ని ప్రవేశపెట్టిన కేంద్ర ప్రభుత్వం
- 2025-26 విద్యాసంవత్సరం నుంచి అమలుకు శ్రీకారం
- ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తులకు గడువు
- ఎంపికైన విద్యార్థికి రూ.50 వేలు అందజేత



ప్రయాస్ మార్గదర్శకాల బుక్‌లెట్

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సైన్స్‌పై ఆసక్తిని పెంపొందించి, పరిశోధన వైపు మళ్లించే దిశగా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రమోషన్ రీసెర్చ్ అటిట్యూడ్ ఇన్ యంగ్‌అండ్ ఆస్పిరింగ్ స్టూడెంట్(ప్రయాస్) అనే పథకాన్ని తెచ్చింది. ఢిల్లీలోని సైన్స్, మ్యాథమెటిక్స్ ఎడ్యుకేషన్ విభాగం (డీఈఎస్ఎం) ద్వారా ప్రయాస్ పథకం అమలు చేస్తారు. ఇందుకు సంబంధించిన మార్గదర్శ కాలను కేంద్ర ప్రభుత్వం జారీ చేసింది.

జిల్లాలో 19,071 మంది విద్యార్థులు

కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టి ప్రయాస్ పథకంలో 9వతరగతి నుంచి 11వ తరగతి విద్యార్థుల వరకు అవకాశం ఉంటుంది. జిల్లాలో 9 నుంచి 11వతరగతి చదువుతున్న 19071మంది విద్యార్థులు అర్హులుగా ఉన్నారు. పాఠశాలల విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. జిల్లాలో 9వ తరగతి విద్యార్థులు 7720 మంది, పదోతరగతి విద్యార్థులు 7465మంది, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు 3886మంది ఉన్నారు. ఒక విద్యార్థి లేదా ఇద్దరు విద్యార్థుల బృందం పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడు లేఖ విద్యాసంస్థ నుంచి ఒక నిపుణుడుతో కలిసి ప్రాజెక్టు సమర్పించేందుకు అవకాశం ఉంటుంది.

పథకం ఉద్దేశాలు...

కేంద్ర ప్రభుత్వం ప్రయాస్ పథకం ద్వారా విద్యార్థుల్లో పాఠశాల స్థాయిలో ఇతర సబ్జెక్టులతో పాటు శాస్త్రీయ పరిశోధనలు, కొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఉపయోగపడుతుంది. విద్యార్థుల్లో తార్కిక ఆలోచనలు పెంపొందించడానికి, సామాజిక, పర్యావరణ సవాళ్లను వినూత్నంగా పరిష్కరించే ఆలోచనలు కలిగించే దిశగా అవకాశం కలుగుతుంది. ప్రయాస్ ద్వారా సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్, ఆర్ట్స్ అండ్ మ్యాథమెటిక్స్‌ను ఏకీకృతం చేయడానికి దోహదపడుతుంది.

ప్రాజెక్టు కాలపరిమితి ఏడాది

ప్రయాస్ పథకంలో ఎంపికైన విద్యార్థులు పాఠశాలలో ప్రాజెక్టు ప్రారంభమైన తేదీ నుంచి పూర్తయ్యే వరకు కాలపరిమితి ఏడాది మాత్రమే ఉంటుంది. అక్టోబరు 16, 2025 నుంచి అక్టోబరు 16.2026 ఈ పథకం ఉంటుంది. ఉపాధ్యాయుడు విద్యార్థులకు పరిశోధనలు మార్గనిర్దేశం చేస్తారు. ఉన్నత విద్యాసంస్థల నుంచి వచ్చిన నిపుణుడు....

మిగతా 8లో

విద్యాసంస్థల్లో ముందస్తు రాఖీ సంబరాలు 8

ప్రభుత్వ విద్యాలయాల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ : కలెక్టర్ 8

శుభప్రదం.. వరలక్ష్మి వ్రతం

- నేడు జిల్లాలో సామూహిక కుంకుమార్చనలు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శ్రావణ మాసం శుక్ల పక్షంలో పున్నమికి ముందు వచ్చే శుక్రవారం వరలక్ష్మి వ్రతంగా జరుపుకోవడం ఆచారం. లక్ష్మీదేవి అష్ట ఐశ్వ ర్యాలకు ప్రతీకగా నిలుస్తుంది. అందుకే వరలక్ష్మి వ్రతాన్ని జరుపుకోవడానికి మహిళలందరు సిద్ధమయ్యారు. శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం చేసుకున్న గుర్తుగా నోచుకున్న వారి చేతులు తోరాలతో కళకళలాడుతుంటా యి. పువ్వులు, కదంబాలు కలిపి కూర్చిన నవసూత్రం కన్నెముత్తయిదువల నుంచి పెద్దముత్తయిదువల దాకా తమ కుడి చేతికి కట్టుకున్న తోరంతో పచ్చగా మెరిసిపోతూ కనిపిస్తారు. వారిలో లక్ష్మికళ ఉట్టిపడుతూ ఉంటుంది. శ్రావణమాసం రాగానే మహిళలు వరలక్ష్మి వ్రతానికి కావాల్సిన సన్నాహాలు చేసుకుంటారు. శ్రావణమాసంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం ఉందనగానే కట్టుకోవాల్సిన కొత్తచీర దగ్గర నుంచి ఇంటి గుమ్మాలు, మండువాలను, పసుపు, కుంకుమ, పూలు, మామిడి తోరణాలతో కళకళలాడిస్తారు. వరలక్ష్మి వ్రతాల కోసం జిల్లాలోని దేవాలయాలు కూడా ముస్తాబు చేశారు. వేములవాడ దేవస్థానంలో శ్రీరాజరాజేశ్వరీదేవి అమ్మవారికి ఉదయం, సాయంత్రం చతుష్షష్టి ఉపచారములతో విశేష పూజలు, సాయంత్రం 4 గంటల నుంచి శ్రీ మహాలక్ష్మీ అమ్మవారికి షోడశోపచార పూజలు నిర్వహిస్తారు.



వరలక్ష్మి వ్రతంలో మహిళలు(ఫైల్)

వరలక్ష్మి వ్రతం శుభాలకు నెలవు...

- తాటిపాముల పల్లవి



వరలక్ష్మి వ్రతం శుభాలను కలిగిస్తుంది. ఎంతో కాలంగా సామూహికంగా అమ్మవారి నామాలతో కుంకుమార్చనలు చేయడం మనస్సుకు ఆనందాన్ని కలిగిస్తుంది. వరలక్ష్మి వ్రతమే కాదు శ్రావణ మాసమంతా సంతోషాన్నిచ్చేదిగానే చెప్పుకోవచ్చు.

కుటుంబం సంతోషంగా ఉండడానికి..

- వంగరి అరుణ



శ్రావణమాసంలో కుటుంబమంతా సంతోషంగా ఉండడానికి అమ్మవారి ఆశీస్సులు అవసరం ప్రతి ఒక్కరూ దేవాలయాల్లో వరలక్ష్మి వ్రతాలను ఆచరిస్తారు. వరలక్ష్మి వ్రతం ఆచరించే రోజు ఉదయం నుంచే సందడిగా ఉంటుంది.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం సీజనల్‌వ్యాధుల నియంత్రణపై అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఫీవర్ కేసులకు తప్పనిసరిగా డెంగ్యూ నిర్ధారణ పరీక్షలు చేపట్టాలన్నారు. ప్రతి గ్రామంలో పారిశుధ్యం నిర్వహణ పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పిస్తూ సీజనల్ వ్యాధుల వ్యాప్తిని అరికట్టాలన్నారు. డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతంలో ప్రత్యేకంగా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. చుట్టుపక్కల ఇళ్లలో ఫీవర్ కేసులపై సర్వేలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు బాధ్యతతో గ్రామాల్లో పిచ్చిమొక్కలను తొలగించి నీటి నిల్వలు ఉన్న చోటా ఆయిల్‌బాల్స్ వేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఆశావర్కర్‌లు, ఏఎన్ఎంలు ఇంటింటి సర్వేలు చేపట్టాలని కోరారు. నీటి నిల్వల వల్ల కలిగే నష్టాలు, దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అధికారి డాక్టర్ రజిత, వేములవాడ ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ పెంచలయ్య, జిల్లా పంచాయతీ అధికారి షర్ఫొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటు

వేములవాడ టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తోడ్పాటు అందిస్తున్నాయని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ అన్నారు. వేములవాడ పట్టణంలోని స్థానిక మార్కెట్ కమిటీ యార్డులో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత బ్రాండ్‌ను గ్లోబల్ స్థాయిలో ప్రాచుర్యం పొందేలా నేతన్నలు కృషి చేయాలని సూచించారు. వస్త్ర పరిశ్రమకు అందిస్తున్న ఆర్డర్లు, యార్న్ బ్యాంక్, విద్యుత్ సబ్సిడీలు, స్కూల్‌యూనిఫామ్‌ల వంటి పథకాలపై వివరించారు. చేనేత ప్రాముఖ్యతపై వ్యాస రచన, ఉపన్యాస పోటీలను నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. చేనేత నాయకులు, కార్మికులు ఉన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి..

ముస్తాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లిస్తూ పీఆర్సీని అమలు చేయాలని టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలంలో గురువారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు బుర్ర కృష్ణప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పీఆర్సీని ప్రకటించాలని, డీఏ అనేది ద్రవ్యోల్బణం కారణంగా పెరిగే జీవన వ్యయాన్ని భర్తీ చేయడానికి ఉద్యోగులకు చెల్లించే భత్యమన్నారు. ప్రతి అయిదు సంవత్సారాలకు ఒకసారి పీఆర్సీ అమలుచేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఉపాధ్యాయ పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని కోరారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి ప్రాథమిక పాఠశాలలకు తరగతికి ఉపాధ్యాయుడిని, పాఠశాలకు ఒక హెచ్‌ఎంను నియమించాలన్నారు. అలాగే 317 జీవోతో స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులు వారి సొంత జిల్లాలకు పంపాలన్నారు. 5571 పీఎస్ హెచ్‌ఎం పోస్టులు మంజూరుచేయలని కోరారు. జిల్లాలకు డీఈవో, డివిజన్‌లకు డిప్యూటీ డీఈవో, మండలాలకు ఎంఈవో పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బోయన్నగారి నారాయణ, రాష్ట్ర కౌన్సిలర్ జిల్లెల్ల శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షులు మహేశ్, లక్ష్మీనారాయణ, ఓరగంటి భాస్కరచారి, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

చందుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సింగాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా గురువారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వేములవాడ డివిజన్ స్థాయిలో పోటీలు నిర్వహించారు. నర్సింగాపూర్ విద్యార్థులు వ్యాస రచన పోటీలో ప్రథమ స్థానం గంగుల శ్రీచరణ్, ఉపన్యాస పోటీలో ప్రథమ స్థానం అర్షనపల్లి అక్షయ, ద్వితీయ స్థానం వొరగంటి రిచిత గెలుపొందగా ప్రధానోపాధ్యాయులు జితేందర్ బహుమతులను ప్రదానం చేశారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రాజన్న సిరిసిల జిల్లా కేంద్రంలో గురువారం జాతీయ చేనేత దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక పాతబస్టాండ్ సమీపం చేనేత చౌక్‌లోని నేతన్న విగ్రహానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజవకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి పూల మాలలు వేశారు. జై నేతన్న.. జైజై నేతన్న నినాదాలు చేశారు. అనంతరం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాల్లో వర్కు ఆర్డర్లు, యారన్ బ్యాంక్ ఏర్పాటు, పాఠశాల విద్యార్థుల యూనిఫాం ఆర్డర్లు, విద్యుత్ సబ్సిడీలను గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుకు వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ ఏడీ రాఘవరావు, వస్త్ర పరిశ్రమ సంఘాలు, అనుబంధ సంఘాల నాయకులు, వస్త్ర పరిశ్రమ యజమానులు, ఆసాములు, పద్మశాలి సంఘం నాయకులు, నేత కార్మికులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో..

బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి నాయకులు నేతన్న విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ కార్యదర్శి మ్యాన రవి, మహిళ పట్టణ అధ్యక్షురాలు బత్తుల వనిజ, కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు వెంగళ శ్రీనివాస్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీష్, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, సిరిసిల్ల అర్బన్ బ్యాంక్ వైస్‌చైర్మన్ అడగట్ల మురళి, గ్రంథాలయం సంస్థ మాజీ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు కల్లూరి రాజు, గెంట్యాల శ్రీనివాస్, దార్ల సందీప్ అన్నారపు శ్రీనివాస్, దార్నం అరుణలక్ష్మీ నారాయణ, రిక్కుమల్ల సంపత్‌కుమార్ నాయకులు పాల్గొన్నారు.



నేతన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్, మహేందర్‌రెడ్డి

సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో..

జిల్లాకేంద్రంలో సామాజిక సమరసత వేదిక ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక నేతన్న విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం ఖాదీభవన్‌లో చేనేత కళాకారులు ఆడెపు పోషవ్వ, తెల్ల కనకవ్వ, వెంగల రవీందర్, గుంటుక మధుసూదన్, రిక్కుమల్ల కొమరయ్య, మంగళారపు రాజేశం, కళ్యాడపు దేవదాస్, ఖాదీ నిర్వాహకుడు ఆడెపు రమేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత వేదిక జిల్లా నాయకులు మోర శ్రీనివాస్, కోడం రవి, గూడూరి భాస్కర్, వివిధ పార్టీల నాయకులు నాగుల శ్రీనివాస్, దూడం శ్రీనివాస్, చిమ్మని ప్రకాష్, మాదాసు శ్రీనివాస్, గుడ్ల విష్ణు, గుజ్జె శివరాం, గాజుల వేణు, దాసరి శ్రీనివాస్, నవీన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయండి

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో శుక్రవారం జరిగే గద్దర్ రెండో వర్ధంతి సభను విజయవంతం చేయాలని తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శనిగరం బాబ్జీ అన్నారు. గురువారం హుజూరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. పీడిత, తాడిత ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గద్దర్‌కు ఘన నివాళులర్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గద్దర్ కుమార్తె, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్, ప్రధానవక్తగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది కాసీం హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కళాకారులు, కవులు, మేధావులు, విద్యా వంతులు, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అనిల్ కుమార్, వెంకన్న, సుధాకర్, విజయేందర్, రాజన్న, తిరుపతి, రహీం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగాపూర్ గ్రామంలో గురువారం ఆటో-బైకు ఢీకొన్న ఘటనలో ఆరుగురికి గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. మండలంలోని రంగాపూర్ గ్రామ శివారులోని జూపాక క్రాస్‌రోడ్డు వద్ద హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్తున్న బైక్‌ను ఆటో ఢీకొని బోల్తాపడింది. ఈ ఘటనలో ఆరుషి, పద్మ, సాయికృష్ణ, లక్ష్మి, తిరుపతికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం అందించారు. క్షతగాత్రులను హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు తప్పని నిరీక్షణ



- ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ. 105.50 కోట్లు
- ఊసేలేని వన్‌టైం సెటిల్‌మెంట్

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యాసంవత్సరం ముగిసినా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వక పోవడంతో ఇతర కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫీజులు కడితే కాని సర్టిఫికెట్లు ఇవ్వబోమని చెప్పడంతో పేద విద్యార్థులు ఆందోళన చెందు తున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను ప్రైవేట్ కళాశాలలకు వన్‌టైం సెటిల్ మెంట్ చేస్తామని గత ఏడాది ప్రభుత్వం హామీ ఇచ్చింది. సంవత్సరం దాటుతున్నా బకాయిల చెల్లింపు లు లేకపోవడంతో విద్యాసం స్థల యాజమాన్యాలు, విద్యార్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో ఫీజు రీయిబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ. 105.50 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడి సుమారు 30 నుంచి 40 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. 2022- 23, 2023-24, 2024-25, సంవత్సరాలకు సంబంధించి బీసీ, ఈబీసీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్నది. సుమారు 35 వేల మంది బీసీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఇందు లో ఎక్కువ శాతం మంది ప్రైవేటు కళాశాలల్లో చదువుతున్నారు. వీరికి రెండేళ్లుగా రూ.77 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఎస్సీ విద్యార్థులకు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. సూమారు మూడు వేల మంది విద్యార్థులకు రూ. 16.28 కోట్లు విడుదల కావాల్సి ఉంది. 2,429 మంది ఎస్టీ విద్యార్థులకు సంవత్సరం కాలంగా సుమారు రూ.7.80కోట్లు, మైనార్టీ విద్యార్థులకు రూ.4.50 కోట్లు పెండిం గ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా నిధులు విడుదల కావడం లేదు. నెల నెలా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్ కూడా విడుదల కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ఆందోళన చెందుతున్న విద్యార్థులు

నిధుల కొరతతో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారు. కొన్ని కళాశాలల్లో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయడంతో ఆందోళన చెందుతున్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థుల నుంచి కాగితాలు రాయించుకుని ఫీజు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు విడుదల చేసిన తర్వాత తిరిగి తమకు చెల్లిస్తామని చెపుతున్నారని విద్యార్థులు అంటున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ అమౌంట్ ఎస్సీ విద్యార్థులకు నేరుగా వారి అకౌంట్‌లోకి జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే ఫీజులు చెల్లించలేని పరిస్థితిలో ఉన్న విద్యార్థులు చదువు మధ్యలోనే ఆపే ప్రయత్నం చేస్తుండగా, ఈ కొత్త విధానంతో మరో సమస్య వచ్చి పడుతుందని ఇటు విద్యార్థులు, అటు యాజమాన్యాలు తలలు పట్టుకుంటున్నాయి.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఎన్నం ప్రకాష్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు



రాష్ట్ర వ్యాప్తంగా మూడు సంవత్సరాలుగా విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది. వెంటనే పాత బకాయిలు విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి. లేని పక్షంలో ప్రభుత్వంపై ఉద్యమిస్తాం.

బకాయిలు చెల్లించి కొత్త విధానం అమలు చేయాలి

కసిరెడ్డి మణికంఠరెడ్డి, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు



2024-25 విద్యా సంవత్సరం నుంచి ఎస్సీ విద్యార్థులకు వారి ఖాతాల్లో నేరుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయడం బాగుంది. కానీ బకాయిలను విడుదల చేసిన తర్వాతనే కొత్త విధానం అమలు చేయాలి.

ప్రైవేటు కళాశాలలు సర్టిఫికెట్స్ ఇవ్వడం లేదు..

చిక్కుల కిరణ్, విద్యార్థి సంఘం నాయకుడు



ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. దీంతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్సీల తో పాటు బీసీ, ఎస్టీ మైనార్టీ విద్యార్థుల ఖాతాలో నిధులు జమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలి.

శతాధిక వృద్ధురాలు మృతి



మీరిబాయి(ఫైల్)

రుద్రంగి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి మండల బడితండా గ్రామంలో మీరిబాయి(120) అనే శతాధికవృద్ధురాలు అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మీరిబాయికి నలుగురు కుమారులు, కూతురు కాగా, 105 మంది మనుమళ్లు, మనుమరాళ్లు, మునిమనుమలు ఉన్నారు. ఇప్పటివరకు మీరిబాయి తన పనులు తానే చేసుకుంటుండేదని, 15 రోజులుగా వృద్ధురాలు అనారోగ్యం బారిన పడటంతో మృతిచెందినట్లు తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలు భరించలేక వంగల దేవరెడ్డి(70) అనే వృద్ధుడు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని దేవరెడ్డి కొంత కాలంగా మోకాళ్ల నొప్పులతో బాధ పడుతున్నాడు. వ్యవసాయ పనులు చేసేందుకు ఆరోగ్యం సహకరించకపోవడం.. అనారోగ్య సమస్యలు అధికమవడం వల్ల జీవితంపై విరక్తి చెంది ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు. మృతుడికిభార్య విజయ, కొడుకు రవీందర్‌రెడ్డి, కూతురు రజిత ఉన్నారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య



రంజిత్(ఫైల్)

జూలపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వడుకాపూర్ గ్రామానికి చెందిన ఐలవేని రంజిత్(25)గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని ఒక బెల్టుషాపులో మద్యం సేవించేందుకు వెళ్లాడు. బెల్టుషాపులో డబ్బును దొంగతనం చేశాడని నిర్వాహకులు రంజిత్‌ను ప్రశ్నించారు. డబ్బులు దొంగలించలేదని తెలిపినా నిర్వాహకులు వినలేదు. దుస్తులు విప్పి చూపించాలనడంతో రంజిత్ దుస్తులను విప్పినట్లుగ్రామస్థులు, కుటుంబసభ్యులుపేర్కొన్నారు. ఈ విషయమై తీవ్ర మనస్తాపానికి గురైన రంజిత్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. సాయంత్రం రంజిత్‌అన్న గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

బొమ్మనపల్లిలో చైన్ స్నాచింగ్

చిగురుమామిడి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మనపల్లి గ్రామంలోగల ఓ ప్రైవేట్‌పాఠశాల వద్ద గురువారం సాయంత్రం మహిళ మెడ నుంచి మూడు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి అపహరించినట్లు ఎస్సై సాయికృష్ణ తెలిపారు. ఆయనతెలిపిన వివ రాలి లా ఉన్నాయి.. హుస్నాబాద్ నుంచి సైదాపూర్ వైపు ద్విచక్ర వాహ నంపై ధనలక్ష్మి, ఆమెభర్త ప్రకాశ్‌తో కలిసి వెలుతోంది. వారిని వెంబడిస్తూ మరో ద్విచక్రవాహనంపై వచ్చిన ఆగంతకుడు ధనలక్ష్మి మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును అపహరించినట్లు తెలిపారు. బాధి తురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేశామన్నారు. సంఘటన స్థలం సమీపంలో ఉన్నపాఠశాల సీసీపుటేజీలను పరిశీలించినట్లుఎస్సై తెలిపారు.

వెంకటాపూర్ శివారులో రోడ్డు ప్రమాదం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. అతివేగం, అజాగ్రత్తగా కారు నడిపి ప్రమాదానికి కారణమైన కామారెడ్డి జిల్లాకు చెందిన సంతోష్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని కంటి వైద్యుడు శ్రీనివాస్ తన కారులో సిరిసిల్ల నుంచి వెంకటాపూర్ మీదుగా ముస్తాబాద్ వెళ్లి తిరుగు పయనమయ్యాడని పేర్కొన్నారు. సిరిసిల్ల నుంచి కామారెడ్డి వైపుకు వెళ్తున్న సంతోష్ అతివేగంగా దూసుకు వచ్చి ఎదురుగా వస్తున్న శ్రీనివాస్ కారును ఢీకొట్టాడు. బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ప్రభుత్వాసుపత్రి పారిశుధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులు

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య కార్మికురాలిని పనిస్థలంలో లైంగికంగా వేధింపులకు గురిచేశాడనే ఫిర్యాదుపై సూపర్‌వైజర్ తాజుద్దీన్‌పై గురువారం కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. బాధితురాలిని కొంతకాలంగా తాజుద్దీన్ వేధిస్తున్నాడని పేర్కొన్నారు. బుధవారం పనులు కేటాయించే సమయంలో నీ సంగతి చూస్తానని, నిన్ను రోడ్డు మీద నిలబెడతానంటూ అసభ్యపదజాలంతో దూషించినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పేర్కొన్నారు.

ఇయర్ ఫోన్స్ ఎంత పనిచేశాయి..

- పాటలు వింటూ ఒకరు.. ఫోన్ చూస్తూ మరొకరు
- రైలు పట్టాలపై వెళుతుండగా ప్రమాదం
- ఇద్దరు యువకుల దుర్మరణం

మధ్యప్రదేశ్‌కు చెందిన దిలీప్‌కుమార్, ఆకలేష్ శ్రీరాంవార్ధడే వరసకు బావ,బామమరుదులు.. జమ్మికుంట మండలం మడపల్లి రైల్వేగేట్ సమీపంలోని సిమెంట్‌బ్రిక్స్ కంపనీలో పనిచేసేందుకు వచ్చారు. తమ బ్యాగులు కంపెనీ ఆవరణలో పెట్టి సమీపంలో రైల్వే ట్రాక్ వైపు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్ధడే ఇయర్ ఫోన్స్ పెట్టుకుని పాటలు వింటూ.. దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌పై నడుస్తున్నారు. ఆ ప్రాంతంలో ట్రాక్ వంపుగా ఉంటుంది. వెనక నుంచి వచ్చిన రైలును వారు గమనించలేదు. వేగంగా వచ్చిన రైలు ఇద్దరు యువకులను ఢీకొని వెళ్లిపోయింది. ఉపాధి కోసం వచ్చిన ఇద్దరు యువకుల జీవితాలు అర్ధాంతరంగా ముగిశాయి.



దిలీప్ కుమార్, ఆకలేష్ శ్రీరాం వార్థడే (ఫైల్)

జమ్మికుంట/జమ్మికుంట రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని మడిపల్లి కెనాల్ రైల్వే ట్రాక్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో మధ్యప్రదేశ్‌లోని చిఖిలి గ్రామానికి చెందిన దిలీప్ కుమార్(25), మహారాష్ట్రలోని సీతపర్ గ్రామానికి చెందిన ఆకలేష్ శ్రీరాం వార్థడే(25) మృతి చెందారు. వీరిద్దరూ మడిపల్లి రైల్వేగేట్ సమీపంలో ఉన్న సిమెంట్ బ్రిక్స్‌లో పనిచేసేందుకు మంగళవారం సాయంత్రం వచ్చారు. తమవెంట తెచ్చుకున్న బ్యాగులను సిమెంట్‌బ్రిక్స్ కంపెనిలో పెట్టారు. బహిర్భూమికి వెళ్తొస్తామని సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లారు. ఆకలేష్ శ్రీరాం వార్ధడే చెవిలో ఇయర్ ఫోన్స్ పెట్టుకుని, దిలీప్‌కుమార్ ఫోన్ చూస్తూ ట్రాక్‌మీద నడుచుకుంటూ వెళ్లారు. గుర్తుతెలియని రైలు వారిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. అటువైపు వెళుతున్న నవజీవన్ ఎక్స్‌ప్రెస్ రైలు డ్రైవర్ స్టేషన్ మాస్టర్‌కు ఫోన్‌చేసి రైల్వేట్రాక్ పక్కన రెండు మృతదేహాలు కనిపిస్తున్నాయని సమాచారం అందించాడు. ట్రాక్‌మన్ అక్కడ వెళ్లి ఇద్దరు యువకుల మృతదేహాలు ఉన్నట్లు గుర్తించి రైల్వే పోలీస్‌లకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసిన రైల్వే పోలీస్‌లు పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మడిపల్లి కెనాల్ వద్ద రైల్వే ట్రాక్ వంపుగా ఉంటుంది. ఆ ప్రాంతంలో రైలు సమీపంలోకి వచ్చే వరకు కనిపించదు. ఇద్దరు యువకులు ఫోన్‌లో నిమగ్నమై ఉండడంతో ప్రమాదం జరిగి ఉంటుందని రైల్వే పోలీస్‌లు భావిస్తున్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా పూర్తి చేసి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రైల్వే ట్రాక్‌ల వద్దకు ప్రజలు వెళ్లొద్దని, వెళ్లినా అప్రమత్తంగా ఉండాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ జి తిరుపతి సూచించారు. మడిపల్లి కెనాల్ వద్ద ట్రాక్ వంపుగా ఉండడంతో ఆ ప్రాంతంలో రైళ్ల సమీపంలోకి వచ్చేవరకు ఏర్పడదని, ఇటువైపు వచ్చే వారు జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

రోడ్డుపై ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

జమ్మికుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని కూరగాయల మార్కెట్‌రోడ్డులో స్కూల్ బస్ వెంట్రుక సందులో ఇరుక్కుపోయాయి. దీంతో 15నిమిషాల పాటు రెండు వాహనాలు ఎటూ కదలకుండా ఉండిపోయాయి. ఇరువైపులా వాహనాలు నిలిచి రాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది. ఇతర వాహనదారుల సూచన మేరకు ఇద్దరు డ్రైవర్లు ఒకదానికి మరొకటి తగలకుండా వాహనాలను ముందుకు తీసుకెళ్లడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారీవాహనాలు ఇరుకు రోడ్డుగుండా రాకుండా పోలీస్‌లు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పట్టణవాసులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



మార్కెట్ రోడ్డులో ఇరుక్కుపోయిన స్కూల్ బస్, లారీ

30 తులాల బంగారం చోరీ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ వివేకానంద పురి కాలనీలోని భార్గవ్ ఎన్‌క్లేవ్ అపార్ట్‌మెంట్‌లో ఓఫ్లాట్‌లో బుధవారం అర్ధ రాత్రి దొంగలుచొరబడి 30తులాల బంగారం అపహరించుకు పోయారు. కరీంనగర్ మూడోటౌణా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గంధం వేదవ్యాస్‌కు చెందిన అపార్ట్‌మెంట్‌లో కొద్దిరోజులుగా రంగులు వేస్తుండటంతో ఆయన కుటుంబం శ్రీపురంకాలనీలో ఉంటున్నారు. ఉదయం నుంచిసాయంత్రం వరకు ఫ్లాట్‌లో ఉంటూ రాత్రి శ్రీపురంకాలనీ ఇంటికి వెళ్లిఅక్కడే నిద్రిస్తున్నారు. బుధవారం రాత్రి 9గంటలకు ఫ్లాట్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లిన వేదవ్యాస్‌కు గురువారం ఉదయం అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండేవ్యక్తి ఫోన్‌చేసి తాళం పగులగొట్టి ఉందని సమాచారం ఇచ్చాడు. వెంటనే వెళ్లి చూడగా బీరువా తెరచి బట్టలు, ఇతరవస్తువులు చిందరవందరగా పడిఉన్నాయి. బీరువాలోని 30తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌లతో తనిఖీలు చేశారు.

తాళం వేసి ఉన్న ఇంటిలో చోరీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో తాళం వేసి ఉన్న మరాఠి లక్ష్మి ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. గ్రామంలోని లక్ష్మి భర్త నాలుగేళ్ల కిందట చనిపోవడంతో ఇంటిలో ఒంటరిగా జీవిస్తోంది. గతనెల 30న సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడులో ఉంటున్న తన తల్లిగారింటికి వెళ్లింది. ఈనెల 6నరాత్రి ఇంటికి తిరిగివచ్చి చూసేసరికి తాళం పగులకొట్టి కనిపించింది. బీరువా ధ్వంసమవడంతోపాటు వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.5వేల నగదు, రూ.12.5వేల విలువైన బంగారు ఆభరణాలను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా కరీంనగర్ రూరల్ మండలం నగునూర్ గ్రామ శివారులో గురువారం ట్రాక్టర్‌ను పట్టుకున్నామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌లపై కేసునమోదుచేసి విచారణ జరుపుతున్నామని సీఐ తెలిపారు

బొంపల్లిలో గంజాయి పట్టివేత

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంపల్లి శివారులోఆటోలో ముగ్గురువ్యక్తులు గంజాయిని తీసుకెళ్తుండగా పెద్దపల్లి రూరల్‌పోలీసులు పట్టుకున్నారు. రూరల్‌ఎస్‌ఐ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్‌కు చెందిన అస్లాం, ఫయాజ్, ఖాజా అనే ముగ్గురు జిల్లాకేంద్రం నుంచి గుర్తుతెలియని వ్యక్తినుంచి 100గ్రాముల గంజాయిని కొనుగోలు చేసి ఆటోలో బొంపల్లి మీదుగా కరీంనగర్ వెళ్తుండగా రూరల్ పోలీసులు తనిఖీ చేశారు. గంజాయి స్వాధీనం చేసుకొని ఆటోతో పాటు ముగ్గురుని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

ఒకే రోజు తండ్రీకొడుకు మృతి

- అనారోగ్యంతో తండ్రి.. ఆత్మహత్య చేసుకుని కొడుకు..
- జగిత్యాల జిల్లా సోమన్‌పల్లి గ్రామంలో విషాదం



తిరుపతి, వెంకన్న(ఫైల్)

జగిత్యాలరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా జగిత్యాలరూరల్ మండలం సోమన్‌పల్లి గ్రామంలో గురువారం తండ్రీకొడుకు ఇద్దరూ ఒకేరోజు మృతి మృతిచెందడంతో విషాదం అలుముకుంది. గురువారం తెల్లవారుజామున చంద వెంకన్న(65) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతిచెందాడు. తండ్రి అంత్యక్రియలకు ఏర్పాటు చేస్తుండగా తీవ్ర మనస్థాపంతో అతని కుమారుడు చంద తిరుపతి (31) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్, గ్రామస్థుల కథనం ప్రకారం చంద వెంకన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఈ క్రమంలోనే ఆరోగ్యం క్షీణించి గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. తిరుపతి తన తండ్రి మృతితో మనస్థాపం చెంది తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనితో వెంకన్న మనమడు అతనికి అంత్యక్రియలు నిర్వహించాడు. రెండు గంటల అనంతరం కొడుకు తిరుపతి అంత్యక్రియలు నిర్వహించారు. ఒకే రోజు తండ్రీకొడుకు మృతిచెందడంతో సోమన్‌పల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో వెంకన్న పెద్దకుమారుడు రవి దుబాయ్‌లో హత్యకు గురయ్యాడు. తిరుపతి భార్య చంద సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు. తిరుపతికి రూ.5లక్షల వరకు అప్పులు ఉన్నాయనిచ ఒక వైపు తండ్రి మరణం కుంగదీయగా, అప్పులు ఎలా తీర్చలనే వేదనతో ఆత్మహత్య చేసుకున్నాడని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నది.

కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 12న నిర్వహించనున్న మూడవ ఎడిషన్ ఆఫ్ కరీంనగర్ హాఫ్ మారథాన్ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆవిష్కరించారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గతరెండు మారథాన్‌లను విజయవంతంగా నిర్వహిం చిన రన్నర్స్ సైక్లిస్ట్ అసోసియేషన్‌ను అభినందించారు. ఈసంవత్సరం కూడా అందరూ పాల్గొనాలన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన తీసుకువస్తున్న కరీంనగర్ రన్నర్స్, సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. ఈ హాఫ్‌మారథాన్‌లో మూడు కిలోమీటర్లు, 5 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 21 కిలోమీటర్ల పరుగు ఉంటుందని ఈ సందర్భంగా హాఫ్ మారథాన్ నిర్వాహకులు పసుల మహేష్ తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరూ karimnagarmarathon.com వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారార్‌లో ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ద్వారా ఎస్సారార్ కళాశాల ఫైనల్‌ఇయర్ విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ తెలిపారు. 21శతాబ్దపు ఉద్యోగ నైపుణ్యాలను కళాశాల డిగ్రీ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు అందించడానికి మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం కుదిరినట్లు తెలిపారు. కళాశాలలో ఆగస్టు11వతేదీ నుంచి 12రోజులు విద్యార్థులకు శిక్షణ ఇస్తారని ప్రిన్సిపాల్ తెలిపారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం సృజన్‌దాస్, మ్యాజిక్‌బస్ ఇండియా శిక్షకురాలు పూర్ణశ్రీ, వైస్‌ప్రిన్సిపల్ నితిన్‌పాఠక్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బీసీ గర్జన సభ వాయిదా

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో శుక్రవారం జరుపనున్న బీసీ గర్జనసభ వాయిదాపడింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిజిల్లాలో బీసీగర్జన సభలు నిర్వహించా లని బీఆర్‌ఎస్ నిర్ణయించి, మొదట 8న కరీంనగర్‌లో సభ ఏర్పాటుకు సన్నాహాలు చేసింది. అయితే వర్షాల కారణంగా సభను వాయిదా వేశామని బీఆర్‌ఎస్ నాయకత్వం ప్రకటించింది. కరీంనగర్‌లో ఈనెల14న బీసీగర్జన సభ నిర్వహించనున్నట్లు పేర్కొన్నది.

వృద్ధురాలి దారుణ హత్య

- కర్ర, బండ రాయితో మోది నీరు లేని బావిలో పడేసిన వైనం



ప్రేమలత(ఫైల్)

జగిత్యాల క్రైం/కొడిమ్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం నాచుపల్లి గ్రామంలో మెన్నేని ప్రేమలత(70) అనేవృద్ధురాలు బుధవారం రాత్రి దారుణహత్యకు గురైంది. ప్రేమలత బుధవారం జగిత్యాలకు వెళ్లి రాత్రి తిరిగిఇంటికి వస్తుండగా కర్ర, బండరాయితో మోది హత్యచేసిన దుండగులు మృతదేహాన్ని ఆమెఇంటి సమీపంలోని నీరులేని బావిలో పడేయడం కలకలంరేపింది. గురువారం తెల్లవారు జామున గ్రామస్థులు మృతదేహాన్ని చూడడంతో విషయం వెలుగులోకి వచ్చింది. తమ పొరుగింటి వారిని దూషించిదనే కారణంతోనే ఈ దారుణం చోటుచేసుకున్నట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. ప్రేమలతకు ముగ్గురు కుమారులు కాగా పెద్దకుమారుడు కొడిమ్యాల సింగిల్ విండో చైర్మన్, కాంగ్రెస్‌పార్టీ నాయకుడు మెన్నే ని రాజనర్సింగరావు. ప్రేమలత ఒంటరిగానే నాచుపల్లి గ్రామంలో ఉన్నతన ఇంట్లో నివసిస్తోంది. ప్రేమలత ఇంటి సమీపంలో రఘునందన్‌రావు అనేవ్యక్తి డెయిరీ, ఫౌల్ట్రీ ఫాం నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నాడు. కొద్దిరోజులుగా ప్రేమలతకు, రఘు నందన్‌రావుకు మధ్య దూషణ జరిగినట్లు గ్రామంలో ప్రచారం జరుగుతోంది. ఈ సందర్భంగా రఘునందన రావును ఆమెదూషించి నందువల్లే ఆమెను హత్యచేశారని అనుమానిస్తున్నారు. జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ ఆరీఫ్ అలీఖాన్, మల్యాల సీఐరవి, కొడిమ్యాలఎస్సై సందీప్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్‌స్క్వాడ్ బృందంతో పాటు ఫింగర్‌ప్రింట్ పోలీసులు పలు ఆధారాలు సేకరించారు. మృతురాలి కోడలు, మాజీఎంపీపీ మెన్నేని స్వర్ణలత గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

మత్తులో విద్యార్థి హల్‌చల్..

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మత్తులో ఓ విద్యార్థి హల్‌చల్ చేసిన సంఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. సిరిసిల్ల పాత బస్టాండ్ సమీపంలోని ఓ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి ద్విచక్రవాహనంపై ట్రిపుల్ రైడింగ్ చేస్తూ మరో విద్యార్థి వాహనాన్ని ఢీకొన్నాడు. దీనితో ఇద్దరు విద్యార్థుల మధ్య మాటామాటా పెరిగి దుర్భాషలాడుకున్నారు. ట్రిపుల్‌రైడింగ్ చేస్తూ వచ్చిన విద్యార్థులు మరో విద్యార్థిపై దాడిచేశారు. దాదాపు అరగంటపాటు ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. సిరిసిల్ల పాతబస్టాండ్‌లో మత్తులో ప్రతిరోజు కొందరు పోకిరీలైన విద్యార్థులు ద్విచక్రవాహనాలపై రైడింగ్ చేస్తూ అసభ్యకరంగా వ్యహరిస్తున్నారు.

ఎస్సారెస్పీ నుంచి నీటి విడుదల



వరద కాలువలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీరు

జగిత్యాల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు అవసరాల కొరకు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీటిని గురువారం అధికారులు, ప్రజాప్రతినిధులు విడుదల చేశారు. పోచంపాడ్ ఎస్సారెస్పీ ప్రాజెక్టు వద్ద కాకతీయ కాలువ ద్వారా సాగునీటి సరాఫరాను తెలంగాణ స్టేట్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అవినాశ్ రెడ్డి, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ప్రారంభించారు. వానాకాలం సాగు సీజన్‌కు గానూ ఎస్సారెస్పీ నీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా వారాబందీ పద్ధతిలో సాగునీటి సరాఫరా కొనసాగించనున్నట్లు అధికారులు ప్రకటించారు. కార్యక్రమంలో ఎస్సారెస్పీ అధికారులు గణేష్, కొండ వంశీ, విన్యాస్‌రెడ్డి, డీఈఈలు, ఏఈఈలు, టీఎస్ జెన్‌కో అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఇన్‌ఫ్లో...

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి 2,153 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీల సామర్థ్యానికి గానూ ప్రస్తుతం 40.582 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత యేడాది ఇదే సమయానికి ప్రాజెక్టులో 46.654 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ఆర్‌ఎఫ్‌సీఎల్ వైఫల్యాలపై సీఎండీ సీరియస్

- ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బేపై బదిలీ వేటు
- ప్రాజెక్టు ఇన్‌చార్జిగా రమేష్ ఠాకూర్

కోల్‌సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో వరుస వైఫల్యాలపై యాజమాన్యం సీరియస్‌గా స్పందించింది. ఆర్‌ఎఫ్‌సీఎల్ సీఎండీ సర్వనన్ ఇటీవల జరిగిన అమ్మోనియా లికేజీ ఉదంతాలను సీరియస్‌గా తీసుకున్నారు. దేశంలో యూరియా అవసరమైన సమయంలో ప్రాజెక్టులో అమ్మోనియా లీకేజీతో 18రోజులు షట్‌డౌన్ కావడంతో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో యూరియా కొరత ఏర్పడింది. తెలంగాణ, కర్ణాటక ముఖ్యమంత్రులు కేంద్రానికి లేఖలు రాశారు. పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ నేరుగా కేంద్ర ఎరువుల శాఖమంత్రినే లక్ష్యంగా చేసుకుని ఆరోపణలు గుప్పించారు. ఈ పరిస్థితుల్లో రామగుండం ఎరువుల కర్మాగారానికి కమిటీని పంపి సీఎండీ విచారణ జరిపించారు. ఈ కమిటీ నివేదిక మేరకు ఏకంగా ప్రాజెక్టు హెడ్ రాజీవ్ గుల్బాపైనే వేటువేసినట్టు తెలుస్తోంది. ఆయనను ఎన్‌ఎఫ్‌ఎల్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేసి, ఆయన స్థానంలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో మెకానికల్ డీజీఎంగా పనిచేస్తున్న రమేష్‌ఠాకూర్‌కు ప్రాజెక్ట్ హెడ్‌గా తాత్కాలిక బాధ్యతలు అప్పగించారు. జూలై 1వ తేదీనే రాజీవ్ గుల్బా ఆర్‌ఎఫ్‌సీఎల్ హెడ్‌గా బాధ్యతలు స్వీకరించారు. నెల రోజులకే బదిలీ చేస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఆర్‌ఎఫ్‌సీఎల్‌లో ఇప్పటికే కేంద్ర కార్యాలయానికి ప్లాంట్‌కు మధ్య సమన్వయం కొరవడిందనే ఆరోపణలున్నాయి. నిర్ణయాలు త్వరగా జరగకపోవడంతో ప్లాంట్‌పై ప్రభావం పడుతోంది. ఇప్పటికైనా యాజమాన్యం పూర్తిస్థాయిలో ఆర్‌ఎఫ్‌సీఎల్‌పై దృష్టి పెడుతుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో పాల్గొన్న యువతులు, తండావాసులు

చందుర్తి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం దేవుని తండాలో తీజ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువతులు గోధుమలను బుట్టలో వేసి తొమ్మిది రోజులు నియమనిష్టలతో ఉపవాసం ఉన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఉండాలని, పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని పూజలు నిర్వహించి, చివరి రోజు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నాగం కుమార్, తండా వీడీసీ అధ్యక్షుడు అజ్మీరా గణేష్, నాయకులు గబ్బర్ సింగ్, భక్తులు, తండా వాసులు, పాల్గొన్నారు.

గురుకుల టెండర్లలో అయోమయం



- టెండర్ల ఫారం ధర నిర్ణయించని ప్రభుత్వం
- ఒక్కో జిల్లాలో ఒక్కో ధర..
- పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో రూ. 25 వేలు
- మిగతా జిల్లాల్లో రూ. 2 వేల నుంచి 10 వేల వరకు
- ఏకీకృత విధానంలో టెండర్లు అంటూ వేర్వేరు ధరలా?
- నిబంధనలు సవరించాలంటున్న కాంట్రాక్టర్లు
- లేకుంటే 12 నుంచి సరుకుల సరఫరా, క్యాటరింగ్ బంద్ చేయాలని నిర్ణయం

పెద్దపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, మటన్, చికెన్ సరఫరాతోపాటు క్యాటరింగ్ చేసేందుకు కామన్ టెండర్లను ప్రభుత్వం ఆహ్వానించింది. అయితే ప్రభుత్వం టెండర్ ఫారాల ధరలను ఖరారు చేయలేదు. దీంతో ఆయా జిల్లాల కలెక్టర్లు తమకు తోచిన విధంగా ధరలను నిర్ణయించి టెండర్ నోటీసులు జారీ చేశారు. అత్యధికంగా పెద్దపల్లి, సూర్యాపేట జిల్లాల్లో ఒక్కో టెండర్ ఫారం ధర 25 వేల రూపాయలు, మిగతా జిల్లాల్లో 2 వేల నుంచి 10 వేల రూపాయలు నిర్ణయించారు. కరీంనగర్ జిల్లాలో రూ.2 నుంచి 5 వేలు, ములుగు జిల్లాలో రూ.10 వేలు, నాగర్‌కర్నూల్, నారాయణపేట్ జిల్లాల్లో రూ.2 వేలు, హైదరాబాద్ జిల్లాలో రూ.3 వేలు, జగిత్యాల జిల్లాలో రూ.5 వేల ధర నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టర్లు ఇదేమి విధానం అంటూ ప్రశ్నిస్తున్నారు. అలాగే జిల్లా యూనిట్‌గా ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు), మండల యూనిట్‌గా కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాట రింగ్ టెండర్లను ఆహ్వా నించింది. జిల్లా, మండల యూనిట్లకు వేర్వేరుగా టెండర్లు దాఖలు చేయాలనుకునే ఒక కాంట్రాక్టర్ ఒకే ఫారంలో దరఖాస్తు చేయాలా లేక వేర్వేరుగా టెండర్ దాఖలు చేయాలా అనే విషయమై స్పష్టత లేకపోవ డంతో కాంట్రాక్టర్లు అయోమయానికి గురవు తున్నారు.



ఏకీకృత విధానంలో టెండర్లు..

రాష్ట్రంలో 1023 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, టీఎస్ రెసిడెన్షియల్ విద్యాలయాలున్నాయి. వీటిలో 6,46, 486 మంది విద్యార్థినీ, విద్యార్థులు విద్యా భ్యాసం చేస్తున్నారు. గతేడాది వరకు ఆయా సొసైటీలు ఒక్కో గురుకుల పాఠశాల, కళాశాల వారీగా, జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో టెండర్లు నిర్వహించే వారు. వీటితో స్థానికంగా ఉండే కాంట్రాక్టర్లకు, మరి కొందరికి ఉపాధి లభించేది. ఆ విధానానికి బదులు రాష్ట్ర వ్యాప్తంగా కొత్త విధానాన్ని ప్రభుత్వం తీసుక వచ్చింది. మెనూ ప్రకారం ఏఏ సరుకులను సరఫరా చేయాలనే విషయమై ఏకీకృత విధానాన్ని తీసుక వచ్చింది.

జిల్లా పర్చేస్ కమిటీల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల్లో ఉన్న గురుకుల విద్యాలయాలకు కలిపి ఆహార పదార్థాలు (కిరాణ సరుకులు) జిల్లా యూనిట్‌గా, కూరగాయలు-పండ్లు, మటన్-చికెన్, క్యాటరింగ్ కోసం మండల యూనిట్‌గా టెండర్లను ఆహ్వానించారు. ఆహార పదార్థాల్లో వంట నూనె, పాలు మినహాయించారు. నూనె, పాలు విజయ సంస్థలకు అప్పగించగా, కోడి గుడ్ల టెండర్లు జిల్లాల వారీగా నడుస్తున్నాయి. ఈ టెండర్లలో పాల్గొనే కాంట్రాక్టర్లు ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఎఫ్ఎస్ఎస్ఏఐ రిజిస్ట్రేషన్, ఐటీ రిటర్న్స్, టర్నోవర్, అనుభవం చూపె ట్టాలి. ఇవేమి లేకుండా మండల సమా ఖ్యలు, యువజన బృందాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒక్కో జిల్లాలో అన్ని సొసైటీలకు సంబంధించి 10 నుంచి 20కి పైగా గురుకుల విద్యాలయాలున్నాయి.

గత నెల 31 నుంచి టెండర్ నోటిఫి కేషన్లు జారీ కాగా, ఈ నెల 14వ తేదీ వరకు దర ఖాస్తులను స్వీకరించనున్నారు. 23న అర్హుల జాబితా ప్రకటన, 28న కాంట్రాక్టర్లకు ఆర్డర్లు జారీ చేయనున్నారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి క్యాటరింగ్ ఆరంభం కానుండగా, సెప్టెంబర్ 15వ తేదీ నుంచి ఆహార పదార్థాలు, ఇతరత్రా కొత్త కాంట్రాక్టర్లు సరఫరా చేయనున్నారు. అప్పటి వరకు పాత కాంట్రా క్టర్లు సరుకులు సరఫరా చేయాల్సి ఉంటుంది.

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్ల అసంతృప్తి..

టెండర్ల విధానంపై కాంట్రాక్టర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టెండర్ ఫారాల ధరలను అడ్డగోలుగా నిర్ణయించడంపై మండిపడుతున్నారు. రాష్ట్రమంతటా ఏకీకృత విధానంలో టెండర్లు నిర్వహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం అన్ని జిల్లాలకు టెండర్ ఫారం ధర ఒకే విధంగా నిర్ణయించక పోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా మహిళా మండల సమాఖ్యలు, యువజన సంఘాలకు ప్రాధాన్యం ఇస్తామన్న ప్రభుత్వం రూ.25 వేలు చెల్లించి టెండర్లు వేస్తారా అనేది అనుమానమే. అలాగే జిల్లా యూనిట్‌గా అన్ని గురుకులాలకు ఒక్క కాంట్రాక్టరే ఆహార పదార్థాలను సరఫరా చేయడం సాధ్యం కాదంటున్నారు. టెండర్ వాల్యూపై సంవత్సరానికి 5 శాతం ఈఎండీ చెల్లించాలని, క్యాటరింగ్‌కు 75 వేల రూపాయల ఈఎండీ చెల్లించాలనే నిబంధన విధించడం గుదిబండగా మారనున్నదని కాంట్రాక్టర్లు అంటున్నారు.

గతంలో ఎస్సీ గురుకులాల్లో ఎస్సీలకు ఈఎండీలో 40 శాతం మాత్రమే చెల్లించాలనే నిబంధన ఉండేది. కానీ ఈ టెండర్లలో అలాంటి మినహాయింపులు లేక పోవడం గమనార్హం. ఈ విధానాలపై కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఆలోచించి గురుకులాల టెండర్ల విధానంలో సవరణలు చేయాలని కోరుతున్నారు. లేదంటే ఈ నెల 12వ తేదీ నుంచి అన్ని గురుకులాలకు సరుకుల సరఫరా, కేటరింగ్‌ను నిలిపి వేస్తామని తెలంగాణ గురుకులాల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రకటించింది. భవిష్యత్ కార్యాచరణపై ఈ నెల 7న గురువారం హైదరాబాద్‌లో సమావేశమవుతున్నారు.

విద్యార్థులు సెల్ఫ్ రిపోర్టింగ్ పూర్తి చేసుకోవాలి

గణేశ్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్లలో దోస్త్ స్పెషల్ ఫేజ్ సీట్ల కేటాయింపు పూర్తయిందని, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సీటు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేసుకోవాలని దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్ రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ఒరిజినల్ టీసీ, ఇతర సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో కళాశాలకు వచ్చి సీటు కన్ఫర్మేషన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. సీటు కన్ఫర్మేషన్ చేసుకోకపోతే సీటు రద్దు అవుతుందని తెలిపారు. శుక్రవారం సీటు కన్ఫర్మేషన్‌కు చివరి తేదీ అని తెలిపారు.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నేషనల్ అకాడమీ ఆఫ్ ఎన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) ఆధ్వర్యంలో డాక్టర్ బీఎస్‌రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. హుజూరాబాద్, సిరిసిల్ల, కరీంనగర్, నూకపల్లి నాక్ కేంద్రాల ద్వారా పలువురు నిరుపేద మహిళలను ఎంపిక చేసి నెలరోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు మాట్లాడుతూ ఈ శిక్షణ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ, మహిళా శక్తిని ప్రోత్సహించడమే ప్రధాన లక్ష్యంగా ఫౌండేషన్ ముందుకు సాగుతుందన్నారు. ట్రైనింగ్ పూర్తిచేసిన అభ్యర్థులకు ప్రామాణిక శిక్షణ సర్టిఫికెట్లు పంపిణీ చేయనున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ ఝాన్సీ, డాక్టర్ శ్రీదేవి, గంగ, న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ జి రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంపులోని కోదండ రామాలయ ప్రాంతంలో ప్రభుత్వ నిషేధిత గంజాయి కలిగి ఉన్న జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన యువకుడిని జగిత్యాల టౌన్ ఎస్సై కుమారస్వామి పట్టుకున్నారు. అతని వద్ద 105 గ్రాముల గంజాయిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పింఛన్లు పెంచకపోతే సీఎంను గద్దె దించుడే..

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ

హుజూరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దివ్యాంగులు, వృద్ధులకు పింఛన్లు పెంచకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గద్దె దించుడం ఖాయమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. గురువారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో హుజూరాబాద్, మానకొండూర్ నియోజకవర్గాల దివ్యాంగులు, వృద్ధుల పింఛన్‌దారుల సన్నాహకసభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు, వృద్ధులకు పింఛన్లు ఇవ్వకపోతే ప్రతిపక్ష పార్టీలు ముఖ్యమంత్రిని నిలదీయాలన్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటఇచ్చిన ప్రకారం అధికారంలోకి రాగానే పింఛన్లు పెంచారన్నారు. తెలంగాణలో మాత్రం 20నెలలు దాటినా ఇవ్వడం లేదన్నారు. 13న జరిగే సభ కంటే ముందు పింఛన్లు పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డికి రాజకీయ ఉరి తప్పదన్నారు. ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు, దివ్యాంగులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా టేబుల్ టెన్నిస్ పోటీలు



టేబుల్ టెన్నిస్ పోటీల్లో తలపడుతున్న బాలికలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి అల్ఫోర్స్ పాఠశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 బాలికల టేబుల్ టెన్నిస్ పోటీలు ఉత్కంఠభరితంగా సాగుతున్నాయి. రెండోరోజు గురువారం అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలతో గుర్తింపు లభిస్తుందని అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి దాదాపు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. వివిధ ప్రాంతాల నుంచి కోచ్‌లు, మేనేజర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

- రెండో రోజు ఫలితాలు..

అండర్-14 విభాగంలో టీం ఈవెంట్‌లో వీపీఎస్ పబ్లిక్ స్కూల్ టైమ్ స్కూల్‌పై 1 పాయింట్ తేడాతో గెలుపొందింది.

అండర్-17 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్ 3-0 పాయింట్ల తేడాతో సీఆర్ రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై గెలుపొందింది. అండర్-19 విభాగంలో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల సీఆర్‌రెడ్డి పబ్లిక్ స్కూల్‌పై 3-0 పాయింట్ల తేడాతో గెలుపొందింది.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు జైలు శిక్షతో పాటు రూ. 10 వేల జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తారకరామనగర్‌కు చెందిన జగన్నాథం సమ్మయ్య, బల్లని సారయ్యతో పాటు మరికొంత మంది కలిసి నిత్యం తాటిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతుండేవారు. చాలా రోజుల నుంచి సమ్మయ్య పేకాటలో డబ్బులు గెలుస్తూ ఉండేవాడు. ఎలాగైనా పేకాటలో సమ్మయ్యపై గెలవాలని సారయ్యతో పాటు అతని మేనల్లుడుతో కలిసి కోరుట్ల ప్రాంతంతో పేకాట ఆడారు. మరోసారి సమ్మయ్యనే గెలువడంతో అతనిపై సారయ్య కక్ష పెంచుకున్నాడు. పథకం ప్రకారం పేకాట ఆడేందుకు సమ్మయ్యను 2021 ఆగస్టు 28న ద్విచక్ర వాహనంపై తాటిపల్లి గ్రామ శివారులోని పెద్దయ్య చెరువు కట్ట వద్దకు తీసుకెళ్లి బండరాయితో కొట్టి హత్యకు పాల్పడ్డారు. అనంతరం సమ్మయ్య మృతదేహాన్ని చెరువులో పడేసి వెళ్లిపోయారు.

మృతుడి కుటుంబసభ్యులు జగిత్యాల రూరల్ పోలీసులకు సమ్మయ్య కనబడడం లేదని ఫిర్యాదు చేశారు. తాటిపల్లి గ్రామ శివారులోని చెరువులో గుర్తుతెలియని మృతదేహం లభ్యంకాగా పోలీసుల విచారణలో మృతదేహాన్ని సమ్మయ్యదిగా గుర్తించారు. హత్యకు పాల్పడ్డ వ్యక్తి సారయ్యతో పాటు అతడి మేనల్లుడు(బాలుడి)గా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి సీఐ కృష్ణకుమార్, ఎస్సై చిరంజీవి, సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు నరేష్, రాజులు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లేశం కేసు వాదించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి సారయ్యకు జీవితఖైదు విధిస్తూ న్యాయ మూర్తి తీర్పు వెలువరించారు. ఈ కేసులో మరో నిందితుడు బాలుడు కావడంతో జువైనల్ కోర్టులో కేసు విచారణ జరుగుతున్నట్లు కోర్టు అధికారులు పేర్కొన్నారు.

చేనేత కాంతిరేఖ

- కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డు అందుకున్న వెల్ది రేఖ
- రాజన్న సిరిపట్టు పితాంబరానికి అరుదైన గౌరవం





రేఖకు అవార్డు అందజేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, అవార్డుతో రేఖ

సిరిసిల్ల ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన చేనేత కళాకారిణి వెల్ది రేఖ నేసిన రాజన్న సిరిపట్టు పితాంబరం చీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా హైదరాబాదులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో చేనేత జౌళి శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చేతుల మీదుగా కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రేఖ అందుకున్నారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో చేనేత కళాకారులు అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటున్నారు. అదే బాటలో మహిళా చేనేత కార్మికులు సైతం అద్భుతాలు సృష్టిస్తున్నారు. చేనేత రంగంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా భావించే కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును రాష్ట్రంలో అందుకున్న తొలి మహిళగా వెల్ది రేఖ నిలిచింది. చేనేత రంగంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని ఖండాంతరాలకు వ్యాపింపజేసిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ సతీమణి రేఖ చేనేత మగ్గంపై సృష్టించిన రాజన్న సిరిపట్టు పట్టు పీతాంబరానికి ఈ అరుదైన గౌరవం పొందారు. 45 రోజులపాటు శ్రమించి చేనేత మగ్గంపై రూపొందించిన పట్టుచీరకు కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ఖ్యాతిని తెలియజేసేలా చేనేత దంపతులు హరిప్రసాద్, రేఖలు ఈ పట్టు పీతాంబరాన్ని రూపొందించారు. రూ.36 వేల విలువైన 48 ఇంచుల వెడల్పు, ఐదు మీటర్ల పొడవు, 605 గ్రాముల బరువుతో ఉన్న ఈ పట్టు చీరలో కాకతీయుల శౌర్యానికి గుర్తు అయిన కమాన్‌తో పాటు వేములవాడ రాజన్న కోడె మొక్కులను సూచించే జరీబుటాలను పొందుపరిచారు. సిరిసిల్ల చేనేత వనితనానికి గుర్తుగా నూలు వడుకుతున్న మహిళ బొమ్మతో కూడిన జరీబుటాను పట్టుచీరపై నేసి అబ్బురపరిచారు.

చేనేత రంగంలో నిత్యం ప్రయోగాలే..

సిరిసిల్లకు చెందిన చేనేత కళాకారులైన వెల్ది హరిప్రసాద్, రేఖ దంపతులు దశాబ్ద కాలంగా నిత్యం ప్రయో గాలు చేస్తూ అద్భుతాలు సృష్టిస్తున్నారు. నేత పరిశ్రమకు కేంద్రమైన సిరిసిల్ల ఖ్యాతిని ఇముడించేలా రాజన్న సిరిపట్టు చీరను రూపొందించారు. అంతేకాక చేనేత రంగంలో కనీవిని ఎరగని రీతిలో అగ్గిపెట్టెలో ఇమిడే పట్టుచీర, దబ్బనంలో దూరే పట్టు చీరతో పాటు జీ20 లోగోను మగ్గంపై నేసి ప్రధాని నరేంద్రమోదీ ప్రశంసలు సైతం అందుకున్నారు. ఇటీవల హైదరాబా ద్ కేంద్రంగా జరిగిన మిస్ వరల్డ్ పోటీల్లో చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ తన ప్రతిభను ప్రదర్శించారు. హరిప్రసాద్ నేసిన చేనేత కళారూపాలను చూసి దేశవిదేశాలకు చెందిన సుందరీమణులు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. హరిప్రసాద్ నేసిన పలు పట్టు చీరలను వస్త్రాలుగా కుట్టి మిస్ వరల్డ్ పోటీ మహిళలు ర్యాంప్ వాక్ చేశారు. చేనేత రంగంలో అద్భుతాలు సృష్టిస్తున్న హరిప్రసాద్ దంపతులను పలువురు అభినందిస్తున్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల వేతనాలు చెల్లించాలి



డీఆర్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు 12 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డీఆర్‌వో వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల వేతనాలు చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 12 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే వంట సరుకులకు సంబంధించిన బిల్లులు 2023 నుంచి రాలేదని తెలిపారు. దీనిపై అనేకసార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. తక్షణమే బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు 10వేల రూపాయల వేతనం చెల్లిస్తామని మాట ఇచ్చారని అన్నారు. కనీస వేతనం ఇవ్వడంతోపాటు ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ గ్రీన్ ఛానల్ ద్వారా పీఎఫ్, ఎంఎస్ ద్వారా బడ్జెట్ విడుదల చేసి నేరుగా కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ సాయిలు, ప్రధాన కార్యదర్శి రజిత, కార్యదర్శి దేవేంద్ర, ఎం లక్ష్మి, బి భాగ్య, హాలియా తదితరులు పాల్గొన్నారు.

ఆదివరాహస్వామి జయంత్యుత్సవాలు ముగింపు



స్వామి వారికి అభిషేకం చేస్తున్న పూజారులు

కమాన్‌పూర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఆదివరాహ స్వామి జయంత్యుత్సవాలు గురువారం ముగిసాయి. స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, అలంకరణ చేశారు. ఆలయ వేదపండితులు హోమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఉదయమే సుప్రభాతం, నిత్య తిరువారాధణ, సేవాకాలం, నిత్యాభిషేకం, గోపూజ, 108 కలశాలతో ఆదివరాహ స్వామికి అభిషేకం చేశారు. చివరగా పూర్ణాహుతి నిర్వహించారు. వేదపండితులు కలకుంట్ల వరప్రసాదస్వామి ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ఈవో కాంతారెడ్డి సౌకర్యాలు కల్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

వర్షాలు కురవాలని ప్రత్యేక పూజలు

మంథనిరూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాలు సమృద్ధిగా కురవాలని సూరయ్యపల్లి గ్రామస్థులు గురువారం గ్రామంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కప్పతల్లిని భుజాన మోస్తూ గ్రామ పుర వీధుల్లో డప్పు చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు. మహిళలంతా బిందెల్లో నీళ్లతో ఊరేగింపులో పాల్గొని గ్రామంలోని హనుమాన్ గుడివద్ద హనుమాన్ విగ్రహానికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కప్పతల్లిని ఊరేగిస్తున్న గ్రామస్థులు

ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ ఖాతాతో.. రూ. 2,500 జమ నమ్మవద్దు

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లో అకౌంట్ ఉంటే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు 2,500 రూపాయలు జమ చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వదంతులు నమ్మవద్దని, ఇది అసత్య ప్రచారమని కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి ఒక ప్రకటనలో తెలిపారు. ఫేక్ న్యూస్‌లను నమ్మవద్దని, ఇందులో ఎలాంటి వాస్తవమూ లేదని తెలిపారు. ప్రభుత్వపరమైన నిర్ణయాలను రాష్ట్ర, జిల్లా యంత్రాంగం అధికారికంగా ధ్రువీకరిస్తేనే వాస్తవంగా పరిగణించాలని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

వీర్నపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పీఎంశ్రీ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి డాక్టర్ సంధ్యారాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఉచిత వైద్యపరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యాన్ని బట్టి ఎత్తు, బరువును పరీక్షించారు. ఇతర ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పరిశుభ్రతను పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫార్మాసిస్ట్ అంజలి, ఏఎన్ఎం గౌరి, ప్రధానోపద్యాయులు ఉదయలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా సీతారాముల కల్యాణం

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణం విద్యానగర్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణత్సోవం వేదపండితులు కృష్ణమాచార్యులు, వేణుమాధవాచార్యులు, రంగాచార్యులు ఆధ్వర్యంలో జరిగింది. వేడుకల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బాలల గ్రంథాలయం ప్రారంభం

ఇల్లంతకుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) :మండలంలోని కందికట్కూర్ గ్రామ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో బాలల గ్రందాలయాన్ని స్కూల్‌కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయిణి మేకల పావని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాద్యాయుడు బద్దం రవీందర్‌రెడ్డి, అనువోజు రాజు, సీఆర్పీ మల్లేశంలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు

ఇల్లంతకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందుతున్నాయని బీజేపీ మండలశాఖ అధ్యక్షుడు భూమల్ల అనీల్‌కుమార్ పేర్కొన్నారు. మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పొత్తూరు, నర్సక్కపేట గ్రామాలలో ఇంటింటి అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చిమ్మనగొట్టు శ్రీనివాస్, గుంటి మహేష్, చక్రాల కార్తీక్, దూది సుదీర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడి ఔదార్యం

ఇల్లంతకుంట, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రంలో మతిస్థిమితం లేని వ్యక్తికి అన్నంపెట్టించి, కొత్తబట్టలు కొనిచ్చి బీజేపీ నాయకుడు మామిడి హరీష్ మానవత్వాన్ని చాటుకున్నాడు. మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డుపై తిరుగుతుండగా హరీష్ కలిసి ఏగ్రామం, ఎక్కడికి వెళ్ళాలని అడుగగా తనకు బాగా ఆకలిగా ఉందని అతను పేర్కొన్నాడు. వెంటనే అన్నం తెప్పించడంతో పాటు కొత్త డ్రెస్ తీసుకవచ్చి మతిస్థిమితం లేని వ్యక్తికి ఇచ్చాడు.

రెండు గ్రామాల్లో ఫీవర్ సర్వే

కోనరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం మల్కపేట, కొలనూరు గ్రామాల్లో కోనరావుపేట వైద్యాధికారి వేణుమాధవ్ ఆధ్వర్యంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులను గుర్తించి పరీక్ష నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం.. విరిగిన విద్యుత్ స్తంభాలు

కోనరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండలం సుద్దాల, మంగళపల్లె ప్రధానరహదారి మీదుగా రైతులకు సరఫరా అయ్యే విద్యుత్ స్తంభాలు టిప్పర్ డ్రైవర్ వల్ల విరిగిపోయాయి. బుధవారం రాత్రి ట్రిప్పర్ మంగళపల్లెలో అన్‌లోడ్ చేసి టిప్పర్ జాకీని కిందికి దించక అలాగే వెళ్లడంతో సుద్దాల, మంగళపల్లె కల్వర్టు ఆవరణలో విద్యుత్ వైర్లు తట్టుకొని ఆరు స్తంభాలు విరిగిపోయాయి. దీంతో సుమారు పదిమంది రైతుల పొలాలకు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో పొలాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. సెస్ అధికారులు స్పందించి విద్యుత్తు స్తంభాలు బిగించి విద్యుత్ సరఫరా చేయాలని కోరుతున్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

కోనరావుపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వాహనదారుడు ప్రతి ఒక్కరు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి తెలిపారు. కోనరావుపేట పోలీస్ స్టేషన్‌లో గురువారం రాత్రి రోడ్డు భద్రత, మాదకద్రవ్యాలు, డయల్ 100 పై కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహనదారుడు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనం నడపొద్దని అన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చందుర్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్ అన్నారు. చందుర్తి మండలంలోని లింగంపేటలో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. మొబైల్ ఫోన్‌లకు పంపే ఏపీకే ఫైల్స్ ఓపెన్ చేస్తే పర్సనల్ డాటాను దోచుకోవచ్చని హెచ్చరించారు. జాబ్ ఆఫర్లు, లోన్ ప్రాడ్స్, ఇన్వెస్ట్‌మెంట్ స్కీమ్స్ పేరిట మోసాలు జరుగుతున్నాయన్నారు. ఫోన్ కాల్ లను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అతివేగంతో దూసుకెళ్లిన ప్రైవేటు పాఠశాల బస్సు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులతో అతి వేగంగా దూసుకెళ్లిన ప్రైవేటు పాఠశాల బస్సును గమనించిన బీజేపీ నాయకులు ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి నుంచి బడి వరకు గురువారం వెంబడించారు. లైసెన్స్ చూపాలని డ్రైవర్‌ను ప్రశ్నించారు. తనకు లర్నింగ్ మాత్రమే ఉందని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. పాఠశాల వద్ద యాజమాన్యంతో వాగ్వివాదానికి దిగారు. అనుభవం, లైసెన్స్ లేని డ్రైవర్లతో బస్సులను ఎలా నడిపిస్తారంటూ మండిపడ్డారు. యాజమాన్యంతో పాటు డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎంఈవో కృష్ణహరి, రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎంఈవో కృష్ణహరి పాఠశాలకు చేరుకుని ఘటనపై వివరాలను సేకరించారు. పూర్తిస్థాయి నివేదికలను ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన పేర్కొన్నారు. నాయకులు గణేశ్, నరేశ్, కిరణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : చేనేత, మరమగ్గాల కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెల్ఫేర్ బోర్డును ఏర్పాటుచేయాలని బీజేపీ కరీంనగర్ పార్లమెంటరీ కో-కన్వీనర్ అడెపు రవీందర్, పట్టణ మాజీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేశారు. మరమగ్గాల పరిశ్రమల యాజమానులు, ఆసాములు కరేంట్ బిల్లుల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దూడం శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేతన్న విగ్రహం ఎదుట ప్రదర్శన

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని నేతన్న విగ్రహానికి గురువారం సీఐటీయూ పవర్ లూం వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పూలమాలలు వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నేతన్న సమస్యలను పరిష్కరించాలంటూ ప్లకార్డులను ప్రదర్శన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్, జిల్లా అధ్యక్షుడు కోడం రమణ, వార్పిన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిరిమల్ల సత్యం, ఉడుత రవి, సూరం పద్మ, దాసరి రూప, జిందం కమలాకర్, బెజుగం సురేష్, బాస శ్రీధర్, స్వర్గం శేఖర్, బింగి సంపత్, కారంపురి మహేష్, చింతకింది మధుసూధన్, దోమల రాము, సందుపట్ల పోచమల్లు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ శిక్షణకు మహిళల ఎంపిక

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : వాహనాల డ్రైవింగ్‌ను నేర్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత శిక్షణకు గురువారం మహిళలను ఎంపిక చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శేషాద్రి అన్నారు. జిల్లాకేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో గురువారం రాష్ట్రంలో 12 జిల్లాల నుంచి వచ్చిన 37మంది మహిళలకు స్ర్కీనింగ్ చేపట్టి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మహిళలకు డ్రైవింగ్‌పై డీఆర్‌డీవో శేషాద్రి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న పలువురికి పరామర్శ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థి హర్షద్, అనారోగ్యం బాధపడుతున్న గంభీరావుపేట మాజీ జడ్పీటీసీ విజయలను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి గురువారం పరామర్శించారు. అనంతరం కలెక్టర్‌తో ఫోనులో మాట్లాడి విద్యార్థి హర్షద్‌కు వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని కోరారు. వెంట నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, బాబు, రాజుకుమార్, తిరుపతి, ఎల్లయ్య, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో పొంచి ఉన్న ప్రమాదం..

- ఆవరణలో పిచ్చిమొక్కలు.. సంచరిస్తున్న పాములు - భయాందోళనలో విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లతిమ్మాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ప్రహరీ లేకపోవడం వల్ల రక్షణ కరువైంది. చుట్టూ వ్యవసాయ పొలాలు ఉం డడం.. తరగతి గదులు, పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు ఏపు గా పెరగడంతో విద్యార్థులకు పాములు, విషకీటకాల భయం పట్టుకుంది. కోతులు అధిక సంఖ్యలో చెట్లపైకి చేరి విద్యార్థులపై దాడికి దిగుతున్నాయి. పాఠశాల ఆవరణలోకి పాడి గేదెలు చేరుతున్నాయి. ఎప్పుడేం జరుగునోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 86 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలలో హెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్న కృష్ణహరి రాచర్లతిమ్మాపూర్, రాచర్లగుండారం ప్రత్యేక అధికారితో పాటు ఎంఈవోగా కొనసాగుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడం వల్ల పాఠశాలతో సమస్యలు తిష్టవేశాయి. తరగతి గదుల చుట్టూ ఆవరణలో పిచ్చిమొక్కలు పెరగడం వల్ల పాములు కనిపిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. ఉదయం, సాయంత్రం ఇంటికి వెళ్లాలంటే కోతుల మందతో భయం వేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూత్రశాలల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయని తరగతి గదుల నుంచి దూరంగా ఉన్న మూత్రశాలల వరకు రావాలంటే భయమేస్తోందని వాపోతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల సెలవు రోజుల్లో ఖాళీ మద్యం సీసాలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని పిచ్చిమొక్కలను తొలగించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



పాఠశాలలో ఆవరణలోని పిచ్చిమొక్కలు

పారిశుధ్య, రక్షణ చర్యలు చేపడుతాం...



- కృష్ణహరి, ఎంఈవో

రాచర్లతిమ్మాపూర్ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ పూర్తిస్థాయిలో లేకపోవడం వల్ల పశువులు ఆవరణలోకి వస్తున్నాయి. పాఠశాల ఆవరణ, తరగతి గదుల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంవల్ల పాములు, విషపురుగులు సంచరిస్తున్నాయి. చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగిస్తాం. చెట్లు ఉండడం వల్ల కోతులు చేరుతున్నాయి. పారిశుధ్యం, రక్షణ చర్యలు చేపడుతాం.

పరిశోధనల వారధి 'ప్రయాస్'

(5వ పేజీ తరువాయి)

విద్యార్థులకు సాంకేతిక, ప్రయోగాత్మక మార్గనిర్దేశం అందిస్తారు. ప్రయాస్ పథకంలో విద్యార్థుల స్వయంగా దరఖాస్తులు చేసుకునే వీలులేదు. పాఠశాల ప్రధానోపాధ్యయుడి ద్వారా ప్రయాస్ యోజన వెబ్‌సైట్‌లో అకౌంట్ ఓపెన్ చేయాల్సి ఉంటుంది. ఒక పాఠశాల నుంచి ఒక ప్రాజెక్టుకు మాత్రమే ప్రతిపాదనలు సమర్పించాల్సి ఉంటుంది. విద్యార్థులకు సైన్స్ ఉపాధ్యాయుడు మార్గదర్శకత్వం వహిస్తారు. ఉన్నత విద్యాసంస్థల సైన్స్ నిపుణులు, టెక్నికల్ గెడ్స్ సహకారాన్ని తీసుకునేందుకు అర్హులైన విద్యార్థులు ఆగస్టు 17లోగా ఆన్‌లైన్ ద్వారా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ ఎన్‌సిఆర్‌టి డాట్ ఎన్‌ఐసి డాట్ ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలి. సెప్టెంబరు 15 నుంచి దరఖాస్తులను పరిశీలించి 30వ తేదిలోపు విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన విద్యార్థికి రూ.50 వేలు పరిశోధన, సామగ్రి, ప్రయాణ ఖర్చులకు, ప్రాజెక్టు రూపకల్పన అందజేస్తారు.

పరిశోధనలకు ఎంతో ఉపయోగం..



- పాముల దేవయ్య, జిల్లా సైన్స్ అధికారి

కేంద్ర ప్రభుత్వం నూతనంగా అందిస్తున్న ప్రయాస్ పథకం ద్వారా విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలు పెంపొందిస్తాయి. సృజనాత్మకత, సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థుల్లో పెంపొందించే దిశగా ప్రయాస్ పథకం ప్రోత్సాహకరంగా, పరిశోధనలకు ఉపయోగకరంగా ఉంటుంది.

విద్యార్థులు ఆకర్షితులవుతారు..



- పాకాల శంకర్‌గౌడ్, ఫిజికల్ సైన్స్ టీచర్

పాఠశాల స్థాయినుంచి విద్యార్థులను పరిశోధన వైపు మళ్లించడానికి ప్రయాస్ పథకం దోహదపడుతుంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశిత లక్ష్యం, భారతదేశం ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలు సాధించడానికి ప్రయాస్ పథకం ఉపయోగపడుతుంది.

విద్యాసంస్థల్లో ముందస్తు రాఖీ సంబరాలు



వీర్నపల్లి ఆదర్శ పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు



ఇల్లంతకుంటలో రక్షాబంధన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు

వీర్నపల్లి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల, గర్జనపల్లి తండా, బంగిరెడ్డి తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ముందస్తు రాఖీ వేడుకలను గురువారం నిర్వహించారు. గర్జనపల్లి తండా హెచ్ఎం తిరుపతి జాదవ్, బంగిరెడ్డి తండా హెచ్ఎం ఎం.కావేరి, ఉపాధ్యాయులు రజితదేవి, వినిత తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలోని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. ఇల్లంతకుంట ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్, అక్కెం నాగరాజు, మంద వంశీకృష్ణ, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దేవరాజం, వాణీనికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనిధి పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి, తదితర గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ముందస్తు రాఖీ పౌర్ణమి వేడుకలను నిర్వహించారు. తెలంగాణ సోషల్ స్టూడెంట్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, బీజేపీ నాయకులు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండలకేంద్రంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రవేట్ పాఠశాలల్లో ముందస్తుగా రాఖీ వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వేంకటేష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో ముందస్తుగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రాఖీ వేడుకలను నిర్వహించి ఎస్ఐ శ్రీనివాస్, పోలీస్ సిబ్బందికి రాఖీలను కట్టారు. కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాద్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

● కోనరావుపేట : కోనరావుపేట మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు పూజ్యం కార్తీక్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ నాయకులు గణేష్ రెడ్డి, చరణ్, అభిషేక్, లలిత, కృష్ణకాంత్, అఖిల్, సంజయ్, ప్రిన్సిపాల్ శివకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంతో పాటు మల్యాల, నర్సింగాపూర్, సనుగుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జితేందర్, శరత్ చంద్ర, ముఖేష్, ఉపాధ్యాయులు, ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, భాగ్యనగర్ మాధవి, లకావత్ ఉమ, బైరి వాణిశ్రీ, కడార్ల కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో కార్పొరేట్ స్థాయి శిక్షణ

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్

సిరిసిల్ల రూరల్/తంగళ్లపల్లి ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులందరికి కార్పొరేట్ స్థాయి శిక్షణను ఉచితంగా అందిస్తున్నామని కలెక్టర్ సందీప్ కుమార్‌ఝా అన్నారు. సిరిసిల్లలో మహాత్మాజ్యోతిబా పూలే బాలిక విద్యాలయంతోపాటు తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లిలోని సాంఘిక సంక్షేమ పాఠశాల, సారంపల్లిలోని గిరిజన గురుకుల పాఠశాల, నేరేళ్లలోని తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్, కళాశాలల్లో గురువారం అన్‌అకాడమీ ఆన్‌లైన్ క్లాస్‌లను కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్‌రెడ్డితో కలిసి కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్య ద్వారానే మార్పులు సాధ్యమని స్పష్టం చేశారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ విద్యాలయాల్లో విద్యార్థుల కోసం ప్రభుత్వం ఆన్‌లైన్ శిక్షణ తరగతులను ఉచితంగా అందిస్తుందన్నారు. విద్యార్థులు పాఠాలు చక్కగా విని నోట్స్‌లో రాసుకోవాలని సూచించారు. పాఠాలల్లో ఏమైనా సందేహాలు వస్తే నివృత్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్థి జీవితంలో 10 నుంచి ఇంటర్మీడియేట్ తరగతులు కీలమన్నారు. ముఖ్యమైన పాఠ్యాంశాలలలో బేసిక్ ఇంటర్‌లో ప్రారంభమతాయన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం, కళాశాల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వంటలను తయారు చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన పెండింగ్ బిల్లును చెల్లించడంతోపాటు ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌పార్టీ ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెలరూ 10వేలు ఇచ్చేలా అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి రాములు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లక్ష్మన్, మధ్యాహ్నభోజన కార్మికులు జుబేదా, లక్ష్మీనర్సవ్వ, విజయ, జ్యోతి, మమత, రోజా, లక్ష్మీ, కొమురవ్వ, ఇమాంబేగం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ స్వాతంత్ర్య సమర యోధులను స్మరిస్తూ జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి మండల కార్యశాలను గురువారం నిర్వహించారు. లక్ష్మారెడ్డి, గణేశ్, నరేశ్, బాలకృష్ణ, రంజిత్, కిరణ్, ప్రదీప్‌రెడ్డి, కుమార్, నర్సయ్య, మల్లయ్య, రమేశ్, బాలగౌడ్, యాదగిరి, తిరుపతి, సాగర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి : విభజన స్మృతి దినం, హర్ ఘర్ తిరంగా, తిరంగా యాత్రను విజయవంతం చేయాలని హర్ ఘర్ తిరంగ కార్యక్రమాల మండల ఇంచార్జీ ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. గురువారం బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు అధ్యర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఇటికల రాజు, కోస్ని వినయ్ యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, ఇటుకల మహేందర్, తుపాకుల సత్యనారయణ తదితరులు పాల్గొన్నారు.

గంభీరావుపేట : మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా మండల స్థాయి కార్యశాల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. మండల ప్రధాన కార్యదర్శి విగ్నేష్, ఉపాధ్యక్షులు నర్సింలు, ఎల్లేందర్, కార్యదర్శులు స్వామి, దేవరాజు, కోశాధికారి నాగరాజుగౌడ్, శక్తి కేంద్రం ఇంచార్జీలు తదితరులు ఉన్నారు.

కోనరావుపేట : బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో ధర్మారంలో హర్ ఘర్ తిరంగా కార్యశాల నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ, ప్రోగ్రాం మండల కన్వీనర్ మిర్యాల పురుషోత్తంరావు, మండల ప్రధాన కార్యదర్శి బైరగోని సురేష్, దడిగే గంగయ్య, మండల ఉపాధ్యక్షుడు ఎడ్ల సుధాకర్, చీకోటి మధు, కోశాధికారి వేల్పుల తిరుపతి, మహిళా మోర్చా అధ్యక్షురాలు జయశ్రీ, మాజీఎంపీపీ తీగల రవీందర్, మాజీ సర్పంచ్ జవ్వాజి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



తంగళ్లపల్లిలో మాట్లాడుతున్న ఆడెపు రవీందర్

చందుర్తి : బీజేపీ మండల కార్యాలయంలో హర్ ఘర్ తిరంగా కార్యశాల గురువారం జరిగింది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, జిల్లా కౌన్సిల్ మెంబెర్ పొంచేట్టి రాకేష్, మండల ప్రధానకార్యదర్శులు మర్రి మల్లేశం, పెరుక గంగరాజు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు చింతకుంట సాగర్ పాల్గొన్నారు.

నానో ఎరువుల వినియోగంపై అవగాహన

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా రైతు వేదికలో గురువారం నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వ్యవసాయ పొలాల వద్ద డ్రోన్‌లతో యూరియా వినియోగంపై వివరించారు. ఇస్కో సంస్థ అభివృద్ధి చేసిన నానో యూరియా ద్రవం వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పుకు నాంది అని జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్ బేగం, ఇస్కో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ బాలజీ, సిరిసిల్ల జిల్లా మేనేజర్ సురేష్‌లు అన్నారు.

ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి పటిష్ట చర్యలు

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్

ముస్తాబాద్, అగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ప్రీ ప్రైమరీ విద్య బలోపేతానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. ముస్తాబాద్ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కెకె మహేందర్‌రెడ్డిలు కలిసి ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ డీఎంఎఫ్టీ నిధులు రూ.20 కోట్లతో జిలాల్లో మొత్తం 170 అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. అన్ని భవనాలు రానున్న ఆరు నెలల్లో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఇందులో భాగంగా ముస్తాబాద్ ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని ప్రారంభించామని వెల్లడించారు. అంగన్‌వాడీల కోసం నూతన భవనాలు నిర్మించి మౌలిక వసతులు కల్పిస్తుందని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు..

నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులున్నాయని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కెకె మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలో మొత్తం 98అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు అనిత, ఏఎంసీ ఛైర్మన్ తలారి రాణినర్సింలు, మాజీ ఎఎంసీ ఛైర్మన్ అంజనేయరావు, మాజీ ఎంపీటీసీలు గుండెల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, దీటి నర్సింలు, వెల్మల రాంరెడ్డి, కొండం రాజిరెడ్డి, షాదుల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ బాధితులకు ఆర్థిక చేయూత



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఈటీసీఏ సభ్యులు

బోయినపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దుబాయిలో అనారోగ్యం బారినపడిన ఇద్దరు వలసకార్మికులకు ఎమిరేట్స్ తెలంగాణ సాంస్కృతిక సంఘం ఆపన్న హస్తం అందించింది. మండలంలోని రత్నంపేటకు చెందిన ఎదురుగట్ల నాగరాజు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో దుబాయిలోని ఆసుపత్రిలో కంపెనీ ప్రతినిధులు చేర్పించారు. విషయం తెలుసుకున్న ఈటీసీఏ ఫౌండర్ పీచర కిరణ్‌కుమార్ స్పందించి సంఘ సభ్యులు రాజేష్, కార్తీక్ రెడ్డికి సమాచారం అందించాడు. వారు ఆసుపత్రికి వెళ్లి నాగరాజు పరిస్థితిని అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అయితే నాగరాజు పక్షవాతం రావడంతో స్వగ్రామానికి పంపించగా కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఈటీసీఏ సభ్యులు దుబాయిలో 50వేల రపాయలను పోగుచేసి ఆసుపత్రిలో ఈటీసీఏ అధ్యక్షుడు జగదీష్, సభ్యుడు సురేష్‌రెడ్డి చెక్కును అందజేశారు. దివికొండ గ్రామానికి చెందిన మామిడి రాజు రోడ్డు ప్రమాదంలో కాలును కోల్పోగా 24వేల ఆర్థిక సహాయాన్ని సభ్యుడు మహమ్మద్ ఆజాద్ ఖాన్ అందజేశారు.

జ్వరాల బారిన గురుకులాల విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు దుమాలలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ గురుకుల ఇంటర్, డిగ్రీ కళాశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలకు చెందిన విద్యార్థులను జ్వరాలు వెంటాడుతున్నాయి. గురువారం అస్వస్థతకు గురైన 10మంది విద్యార్థులను సిబ్బంది మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. విద్యార్థులు దురద, తీవ్ర జ్వరాలతో బాధ పడుతున్నారని వైద్యులు గుర్తించారు. వైద్య పరీక్షలు నిర్వహించారు. సమాచారం అందుకున్న ఎంఈవో కృష్ణహరి దుమాల గురుకులానికి చేరుకుని విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు.

మహిళా మోర్చా ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో గురువారం మహిళా మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్‌తో పాటు ఎస్పీ కార్యాలయం, సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో సిబ్బందికి రాఖీలను కట్టారు. అలాగే బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీతోపాటు నాయకులకు రాఖీలు కట్టారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, పట్టణ అధ్యక్షురాలు వేములవైశాలి, ప్రధాన కార్యదర్శి మాధవి, ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షురాలు స్రవంతి, లహరి, తేజశ్రీ తదితరలు పాల్గొన్నారు.